క్లుప్తంగా

నక్కవానిపాలెంలో అన్నసమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం వద్ద గల శ్రీ ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినం, ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు రామారావుశర్మ, మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అన్నసమారాధనను బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక, సునీల్‌అగర్వాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది శేఖర్, శివ, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి పండగ



అన్నప్రసాదం వడ్డిస్తున్న రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మహత్ కాలనీలో శ్రీ దుర్గాదేవి పండగ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొని ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. పాపారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీలో కలర్ డిస్కవరీ డ్రాయింగ్ స్కూల్‌ను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు.

ఇంటర్ హాల్ టికెట్ల జారీ



ఇంటర్ హాల్‌టికెట్లు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సీతమ్మధార : స్థానిక పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం ఇంటర్ హాల్ టికెట్లు జారీ చేశారు. ఇక్కడ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సిబ్బంది హాల్‌టికెట్లు జారీ చేశారు. ఈ కళాశాలలో మొత్తం 56 మంది చదువుకుంటున్నారు. మార్చి ఒకటి నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులంతా కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కళాశాల అధ్యాపకులు ప్రియదర్శిని, త్రినాథమూర్తి, వరలక్ష్మి, విక్టర్, భారతి, సంధ్యారాణి, భవానీ పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో రోగులకు అందిస్తున్న భోజనంపై ఆరా

దాబాగార్డెన్స్: వైద్య సేవల కోసం కేజీహెచ్‌కు వచ్చే రోగులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తున్నామని ఆస్పత్రి పరిపాలనాధికారి బీవీ రమణ తెలిపారు. ఆస్పత్రిలోని ఎస్ – 5 వార్డు వద్ద రోగులకు అందిస్తున్న భోజనాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల సహాయకులతో మాట్లాడి భోజనం ఎలా ఉందని ఆరా తీశారు. గర్భిణులతో పాటు ఇతర సాధారణ రోగులకు కూడా సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని డైటీషియన్ రమణమూర్తిని ఆదేశించారు. అనంతరం ఆయన భోజనం రుచి చూశారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 – 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 (టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081)కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

ఓం నమో శివరుద్రాయ

శివరాత్రి వేడుకలకు శివాలయాలు సిద్ధం



తిక్కవానిపాలెంలో రంగులు దిద్దుకుంటున్న హేరంబ కోదండేశ్వరాలయం

కంచరపాలెం : దోసెడు పవిత్ర జలం, గుప్పెడు విభూది, నాలుగు మారేడు దళాలు సమర్పిస్తే చాలు పరమశివుడు ప్రసన్నుడైపోతాడు. అవీ లేకున్నా 'శివోహం' అని త్రికరణశుద్ధిగా స్మరిస్తే అనుగ్రహించే భక్త సులభుడు. ఈ లోకంలో సత్యం విశిష్టతను శాశ్వతంగా ఆవిష్కరించేందుకు శివరాత్రి పర్వదినాన జ్యోతిర్లింగమై అవతరించిన తేజోరూపుడు... 'శివోహం' అనేది కేవలం నోటితో ఉచ్చరించే మంత్రం కాదు. సామాజిక మార్గదర్శకమైన గుణాలను మనసా, వాచా, కర్మణా ఆచరించి శివమే 'అహం' అని చాటి చెప్పాల్సిన గొప్ప విప్లవ నినాదం. ఈ విశ్వం శాంతి సామరస్యాలతో వసుధైక కుటుంబంగా విలసిల్లేందుకు అనుసరించాల్సిన సద్గుణాలకు సాకారరూపం. నేటి సమస్యల సాధనకు అనుసరించాల్సిన పరిష్కారాల సమాహారం. అదే నేటి ఈ మహాశివరాత్రి సందేశం. ఈ నెల 26న బుధవారం వైభవంగా నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు నియోజకవర్గంలోని శివాలయాలు సిద్ధమయ్యాయి.

ప్రత్యేక పూజలు, అభిషేకాలకు ఏర్పాట్లు

కంచరపాలెం పరిధిలో గౌరీ శంకరాలయం, యల్లబిల్లివారి గౌరీ శంకర పంచాయతన ఆలయం, తిక్కవానిపాలెం అన్నపూర్ణ విశ్వేశ్వరాలయం, ఇందిరానగర్‌లో లక్ష్మీగణపతి ఈశ్వరరాలయం, రామ్మూర్తిపంతులపేట రామలింగేశ్వరరాలయం, సాంబమూర్తినగర్ కాలనీలో అన్నపూర్ణ ఆలయం,



రంగులు దిద్దుకుంటున్న జ్ఞానాపురం విఘ్నేశ్వర పార్వతీశ్వరాలయం



ధర్మానగర్‌లో ముఖద్వారాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం

104 ఏరియా బాపూజీనగర్ శివాలయం, ధర్మానగర్ బీవన్‌టీవన్ కాలనీలో హేరంబ కోదండ ఉమా మహేశ్వరాలయం, జ్ఞానాపురం విఘ్నేశ్వర పార్వతీశ్వరాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శివ పార్వతుల కల్యాణోత్సవం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, అర్చనలు, రజిత బిల్వార్చన, పూర్ణాహుతి, శతరుద్రాభిషేకం, తదితర పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఉపవాసం, జాగరణ కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రంగులతో ఆలయ గోపురాలు కళకళలాడుతున్నాయి. ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆ రోజు అర్ధరాత్రి 12 గంటలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

● తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు వరాహగిరి కాలనీ – 2లో గల అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరాలయం మహా శివరాత్రి వేడుకలకు సిద్ధమైంది. బుధవారం మహా శివరాతి సందర్భంగా ఆలయ ధర్మకర్త కేదారిశెట్టి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు అర్చకులు అంబటిపూడి సుధీర్‌శర్మ తెలిపారు.

విద్యుత్ కాంతులు, మామిడి తోరణాలతో ముస్తాబు



సీతంపేటలో విద్యుత్ దీపాలతో ముస్తాబైన పార్వతీశ్వరాలయం

సీతంపేట: శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మహాశివరాత్రి ఉత్సవాలకు ఉత్తర నియోజకవర్గంలోని శివాలయాలన్నీ విద్యుత్ కాంతులు, మామిడి తోరణాలతో ముస్తాబయ్యాయి. బుధవారం మహా శివరాత్రి పర్వదినం కావడంతో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన శంకరమఠం రోడ్‌లో గల రామలింగేశ్వరాలయం, సీతంపేట పార్వతీశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఈవో జి.వి.రమాభాయి తెలిపారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ఏకవార అభిషేకాలు, పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 9 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్ధరాత్రి 12 గంటల సమయంలో లింగోద్భవ కాలంలో భక్తులగోత్ర నామాలతో శివలింగానికి అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే శంకర మఠం, జగ్గారావు బ్రిడ్జి వద్ద గౌరీ పరమేశ్వరుల ఆలయాల్లో మహాశివరాత్రి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని అర్చకులు తెలిపారు.



రామకృష్ణానగర్‌లో ముస్తాబైన రామలింగేశ్వరాలయం

● అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో మహాశివరాత్రి రోజు తెల్లవారుజాము నుంచి శివలింగానికి అభిషేకాలు, అఘోర పాశుపత హోమం, రాత్రి కాళీ కాల భైరవులకు మహాన్యసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

సామాజిక చైతన్యం పెంపొందించాలి



ఇస్కఫ్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట : సామాజిక చైతన్యాన్ని పెంపొందించే విధంగా ఇస్కఫ్ కార్యక్రమాలు రూపొందించుకోవాలని నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ సూచించారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) సర్వసభ్య సమావేశం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యువతలో సామాజిక చైతన్యం తీసుకురావాలని, కళలు అంతరించిపోకుండా భావితరాలకు అందించేలా ఇస్కఫ్ భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. అనంతరం ఇస్కఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గాన్ని బాలమోహన్‌దాస్ అభినందించారు. ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడిగా కె.సురేష్ కుమార్, క్షేత్రపాల్ రెడ్డి, మధుమతి, ఇమంది పైడిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ మార్కండేయులు, కార్యదర్శిగా కె.సత్యాంజనేయ, కోశాధికారిగా జి.సూర్యకుమారి, ఎం.ఎ.బేగం, సత్యవతి, ఉపాధ్యక్షులుగా జె.రాంప్రభు, సీహెచ్.మధుబాబు, రాజకుమారి, అప్పన్న, కె.విజయమణి, మనుపల్లా, వి.జహరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుకుమారన్, ఎస్.నర్సింహులు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉప్పల అప్పలరాజు, వి.వెంకటరావు, ఐ.ఎం.మహ్మద్, ఝాన్సీ మాధవి పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శివయ్య



శివపార్వతుల కల్యాణోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు రామారావుశర్మ, మహేష్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అంతకుముందు పురవీధుల్లో పల్లకిలో ఉత్సవ విగ్రహాలను శోభాయాత్రగా ఊరేగించారు. సిబ్బంది, వెంకట విజయ గోపాలరాజు, చైతన్య, మార్పుల్ రమేష్, గుప్తాజీ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



కేకే రాజుని సత్కరిస్తున్న కర్రి రామారెడ్డి



పేడాడ రమణకుమారిని సత్కరిస్తున్న కేకే రాజు

సీతమ్మధార : పార్టీ అధిష్టానం పెట్టుకున్న నమ్మకానికి న్యాయం చేసేలా వైఎస్సార్ సీపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఆ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ మజీ చైర్మన్ కేకే రాజు కోరారు. వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ విభాగం విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కర్రి రామారెడ్డి సీతమ్మధారలో గల కార్యాలయంలో కేకే రాజుని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.

● వైఎస్సార్ సీపీ మహిళా విభాగం విశాఖ జిల్లా అధ్యక్షురాలుగా నియమితులైన పేడాడ రమణ కుమారి సోమవారం సీతమ్మధారలోని కేకే రాజు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేకే రాజు ఆమెకి అభినందనలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు.

వసతి గృహంలో ఇద్దరు వృద్ధురాళ్లకు ఆశ్రయం



వృద్ధురాలు లక్ష్మిని వసతి గృహంలో అప్పగిస్తున్న యువకులు

సీతమ్మధార: ఈ వృద్ధురాలి పేరు తాటిపిల్లి లక్ష్మి(75). ఊరు తగరపువలస. ఆరిలోవ పోలీసులు పంపించారని చెప్పి.. ఇద్దరు యువకులు ఈమెను ద్వారకానగర్‌లోని ఏయూటీడీ–జీవీఎంసీ మహిళా షెల్టర్ హోమ్‌కు సోమవారం అప్పగించారు. వృద్ధురాలిని తన వివరాలు అడగ్గా.. కుటుంబ సభ్యులున్నారని చెప్పి, ఇతర ఏ విషయం స్పష్టంగా చెప్పలేకపోయారు. ఈమెకు వసతి గృహంలో తాత్కాలికంగా కొన్ని రోజులు ఆశ్రయం కల్పించినట్లు షెల్టర్ హోమ్ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.


● ఇంటి నుంచి వచ్చేసిన వృద్ధురాలికి ద్వారకానగర్‌లోని టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ – ఏయూటీడీ వసతి గృహంలో సోమవారం ఆశ్రయం కల్పించారు. కంచరపాలెం ప్రాంతానికి చెందిన దుక్క అన్నమ్మ (60)కు ఇద్దరు కుమార్తెలు. ఆమెను కుమార్తెలు తిడుతూ కొడుతుండడంతో ఆ బాధ భరించలేక ఇంటి నుంచి వచ్చేసింది. ఆమెను గుర్తించిన రెండో పట్టణ పోలీసులు ఏయూటీడీ మహిళా షెల్టర్ హోమ్‌కి తరలించారు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సూచన మేరకు అన్నమ్మకు ఆశ్రయం కల్పించామని వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం : అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో చేపడుతున్న చెట్ల కొమ్మల తొలగింపు, హెచ్‌టీ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈపీడీసీఎల్ జోన్ – 1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. నరసింహనగర్, గ్రీన్‌పార్క్ ఏరియా, పద్మశ్రీ హాస్పిటల్, శంకరమఠం రోడ్, బాలయ్య శాస్త్రి లే అవుట్, గణేష్ నగర్, అండమాన్ గెస్ట్ హౌస్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

సహనమే శ్రీరామరక్ష


● గరికపాటి నరసింహారావు



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న గరికపాటి నరసింహారావు

మురళీనగర్ : సహనమే శ్రీరామరక్ష అని.. సహనం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని వేములపల్లి కళాక్షేత్రంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనిషికి కష్టాలు కలకాలం ఉండవని, కష్టకాలంలో నిబడినవారు శాశ్వత సుఖాన్ని పొందగలరని చెప్పారు. మనిషికి ఆరాధన ఎక్కువై ఆచరణ లోపిస్తోందన్నారు. భగవన్నామస్మరణే అన్నివేళలా మానవుడిని రక్షిస్తుందన్నారు. పెద్దలు చెప్పిన మంచిని గ్రహించి అమలు చేసినవారే ధన్యులని ఆయన వివరించారు. శ్రీరాముడి లాంటి మహానుభావుడు తన జీవితంలో చూపిన సహనమే ఆయనను గొప్పవాడిని చేసిందని, ఆయనను భగవంతుడిగా మార్చిందని వివరించారు. తొందరపాటులో ఆవేశపూరిత చర్యలకు పాల్పడకూడదన్నారు. ఉత్తమ ఆలోచనలతో ఉత్తమ పురుషులుగా మారుతారన్నారు. ముందుగా వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వరప్రసాద్, పీవీఎస్ఎన్ రాజు, ఇతర కమిటీ సభ్యులు గరికపాటి నరసింహారావుకి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సత్కరించారు.

బోరు వద్ద కార్లకు వాటర్ సర్వీసింగ్



బోరు వద్ద రోడ్డుకి అడ్డంగా కారు ఆపి వాటర్ సర్వీసింగ్ చేస్తున్న డ్రైవర్

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పరిధిలోని పీ అండ్ టీ కాలనీలో గల ఒక బోరు వద్ద కార్లకు వాటర్ సర్వీసింగ్ చేసుకోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇక్కడ స్థానిక ప్రజల తాగునీటి అవసరాల కోసం గతంలో బోరు ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ కాటమ్మ అమ్మవారి (మామిడి చెట్టు) దేవాలయం పక్కన గల బోరు వద్ద కార్లు అడ్డంగా ఆపేసి మరీ డ్రైవర్లు వాటర్ సర్వీసింగ్ చేసుకోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఇక్కడ కార్లు పార్కింగ్ చేసి వాటర్ సర్వీసింగ్ చేస్తున్నా స్థానిక సచివాలయం ఎమినిటీస్ కార్యదర్శి పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ట్రాఫిక్ సమస్యలు కూడా ఎదురవుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. మరోవైపు కార్లు అడ్డంగా పార్కింగ్ చేసి వాటర్ సర్వీసింగ్ చేస్తుండడంతో మంచినీటి కోసం తమకు నిరీక్షణ తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి బోరు వద్ద కార్లు వాటర్ సర్వీసింగ్‌కు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

మూడు పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఎంవీఎస్ శర్మ, పద్మజా షా, తదితరులు

సీతంపేట : మార్క్సిస్టు అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మూడు పుస్తకాల ఆవిష్కరణ సభ సోమవారం నిర్వహించారు. కన్నడ మూలం నుంచి ఆచార్య జి.రామకృష్ణ రాసిన 'రుగ్వేద యదార్థ దర్శనం పుస్తకాన్ని ఎంవీఎస్ శర్మ ఆవిష్కరించగా, కొబడ్ గాంధీ రాసిన 'బీటలు వారిన స్వేచ్ఛ' పుస్తకాన్ని, వివినమూర్తి రాసిన 'వాడు నేను' నవలను పద్మజా షా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ మౌఖిక సాహిత్యంలో రుగ్వేదానికి విశిష్ట స్థానం ఉందన్నారు. కాలక్రమేణా రుగ్వేదాన్ని ఒక మత గ్రంథంగా చూస్తే నాటి సమకాలీన సమాజం, దాని సంక్లిష్టత, బహుముఖ రూపాలు, వాటి మధ్య ఉండే సంబంధాలను అర్థం చేసుకోవడం సాధ్యం కాదన్నారు. బహుముఖ కోణాల నుంచి విశ్లేషణ చేయాలని, ప్రాచీన సంకలనానికి నమూనాగా నిలిచిన రుగ్వేద యదార్థ దర్శనం పుస్తకం చదవాలని కోరారు. పద్మజా షా మాట్లాడుతూ కూడు, గూడు, నీడ మనిషి స్వేచ్ఛకు సంబంధించిన మూడు త్రిముఖ పార్శ్వాలని, అవి మనిషి మనుగడకు ఎంతో ముఖ్యమైనవని తెలిపారు. దశాబ్ద కాలం పాటు జైలుపాలై నిరపరాధిగా బయటపడిన సామజిక మేధో జీవి కొబడ్ గాంధీ రాజకీయ జ్ఞాపకాల దొంతరే బీటలు వారిన స్వేచ్ఛ పుస్తకమని తెలిపారు. రచయిత వివినమూర్తి మాట్లాడుతూ గత 60 ఏళ్ల నుంచి భారతదేశంలో సాగుతున్న వివిధ పరిణామాలను ఈ పుస్తకంలో ఆవిష్కరించడం జరిగిందన్నారు. మార్క్సిస్టు అధ్యయన కేంద్రం నిర్వాహకులు జె.వి.సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యుడు వృద్ధుల కల్యాణ రామారావు, కె.ఎస్.మల్లీశ్వరి, కె.మురళి పాల్గొని పుస్తక సమీక్ష చేశారు.

పార్కుల్లో విద్యుత్ దీపాల మెరుపులు



వాకర్స్ పార్కులో విద్యుత్ తోరణం

మురళీనగర్ : మురళీనగర్‌లోని పలు పార్కులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడంతో వెలుగుజిలుగులతో మెరిసిపోతున్నాయి. సందర్శకులను ఆకర్షించి వారికి ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు పార్కు నిర్వాహకులు తమ సొంత నిధులతో వీటిని ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా సుదర్శన్ పార్కు, బృందావన్ పార్కు, వాకర్స్ పార్కులో సీరియల్ లైట్లు అమర్చారు. వాకర్స్ పార్కులో చెట్ల కాండాలతోపాటు, తీగ మొక్కలతో అలంకరించిన ప్రవేశ ద్వారాలకు సీరియల్ లైట్లు అమర్చారు. ప్రతి మూలన చెట్లకు ఈ లైట్లు ఏర్పాటు చేశారు. ఇటీవలే అభివృద్ధి చేసిన సుదర్శన్ పార్కులో అదనంగా ఈ సీరియల్ సెట్లను అమర్చడంతో మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. పిల్లలు, పెద్దలను విద్యుత్ వెలుగులు ఆకర్షిస్తున్నాయి. సప్త వర్ణాల విద్యుత్ కాంతుల మధ్య వాకర్స్ ఆహ్లాదకరంగా ఉల్లాసంగా వాకింగ్ చేస్తూ మానసిక ప్రశాంతతను పొందుతున్నారు.

సిగ్నల్స్ ఉన్నా.. ట్రాఫిక్ నియంత్రణ శూన్యం

రెడ్‌సిగ్నల్ పడినా ఆగని వాహనచోదకులు



ద్వారకానగర్ సిగ్నల్స్ వద్ద గందరగోళంగా వాహనాల రాకపోకలు

సీతమ్మధార : నగరంలో నిత్యం రద్దీగా ఉండే ఆశీలమెట్ట, ఆర్టీసీ కాంప్లెక్స్, సంగమ్ శరత్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ గందరగోళంగా ఉంటోందని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు లేని సమయంలో సిగ్నల్స్ బాగానే పనిచేస్తున్నా... చాలా మంది వాహన చోదకులు రెడ్‌సిగ్నల్ ఉన్నప్పటికీ రయ్ రయ్‌మని దూసుకుపోతున్నారు. దీంతో గ్రీన్‌సిగ్నల్ మార్గంలో వెళ్లే వాహనచోదకులు, పాదచారులు హడలిపోతున్నారు. ద్వారకా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్, గురజాడ అప్పారావు జంక్షన్, సంగమ్ – శరత్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ గందరగోళంగా ఉంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ మార్గంలో 69, 411, 211, 28వ నంబరు సిటీ బస్సులతో పాటు అరకు, ఎస్.కోట, నర్సీపట్నం, అనకాపల్లి నుంచి వచ్చే బస్సులు, మెట్రో సర్వీసులు రాకపోకలు సాగిస్తాయి. ఈ నేపథ్యంలో ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు రాత్రిపూట సిగ్నల్స్‌కి విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మరోవైపు సందట్లో సడేమియా అన్నట్టుగా ఆటోవాలాలు రోడ్డు మలుపు తిరిగే ప్రాంతంలో దర్జాగా పార్కింగ్ చేసి మరీ ప్రయాణికుల కోసం నిరీక్షిస్తుండడం గమనార్హం. దీంతో వెనుకగా వచ్చే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ద్వారకా ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్‌ని గాడిలో పెట్టేలా చర్యలు చేపట్టాలని పాదచారులు, వాహనచోదకులు కోరుతున్నారు.